విదేశాల్లో కాదు..మూసీ ప్రాంతంలో పర్యటించాలి

ఎంపీ ఈటల రాజేందర్


కొత్తపేట-చైతన్యపురి మూసీ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న ఎంపీ ఈటల

నాగోలు: మూసీ ప్రక్షాళన పేరిట మంత్రులు సీయోను న్యూయార్క్ దేశాల్లో తిరగడం కాదని.. మూసీ నదికి ఇరువైపులా తిరిగి ప్రజల కష్టాలు తెలుసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. మూసీ హౌస్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాలతో పేద ప్రజల జీవితాలు మట్టిలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రాంతప్రజలు శని, ఆదివారాల్లో కంటి మీద కునుకు లేకుండా జీవిస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో ఇళ్లకు మార్కింగ్ వేసి భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. 'ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం' అన్నట్లు ఇంకా డీపీఆర్ తయారు కాలేదు మూసీకి రూ.1.50 లక్షల కోట్లు అంటూ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పునరుద్ధరణ ఎలా చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క ఇల్లు కూల్చకుండా మూసీని సుందరీకరణ చేసుకోవాలని సూచించారు. మూసీ తీరంలో రిటైనింగ్ వాల్ కట్టి, మురుగునీటిని తొలగించాలన్నారు. మూసీ నిర్వాసితులతో ఈ నెల 25న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి, నాయికోటి పవన్ కుమార్, నరసింహ గుప్తా, బద్దం ప్రేమ్ మహేష్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లకు బీమా చేయడం అభినందనీయం


నక్క యాదగిరిని సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: ఎలక్ట్రీషియన్లు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క యాదగిరి అన్నారు. బుధవారం పోలీ క్యాబ్ కంపెనీ ఆధ్వర్యంలో నాగోలు అల్కాపురిలో ఎలక్ట్రీషియన్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నక్క యాదగిరి పాల్గొన్నారు. ఎలక్ట్రికల్ పనిచేసే సమయంలో విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా వృత్తిలో మెలకువలు నేర్పించారు. విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు కరెంట్ స్తంభాలు ఎక్కిన వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీ క్యాబ్ కంపెనీ తరుపున ఎలక్ట్రీషియన్లకు రూ.2 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ చేయడం అభినందనీయమని యాదగిరి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోనార్క్ రావల్, కంపెనీ ప్రతినిధి సుమన్, ప్రమోద్, జగన్నాథ్ వెంకట్, ఎస్.బెనర్జీ, ఆర్ శ్రీనివాస్, పి గోవర్ధన్, శ్రీకాంత్ రెడ్డి, గోలి గిరి పాల్గొన్నారు.

కామినేనిలో అత్యాధునిక చికిత్స

మన్సూరాబాద్: డెంగీతో దెబ్బతిన్న ఊపిరితిత్తుకు అత్యాధునిక చికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడారు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ వైద్యులు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు వెంకటరమణ, శృంగల దేవిజన్ వివరాలను వెల్లడించారు. నాచారం ప్రాంతంలో నివసిస్తున్న ఓ వ్యక్తికి డెంగీ వ్యాధితో బాధపడుతూ ఆక్సిజన్ శాచ్యురేషన్ బాగా పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కామినేని హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. రోగిని పరిశీలించిన వైద్యులు అత్యాధునికమై ఎక్మో చికిత్సతో ఆరు రోజుల్లో రోగి ఊపిరితిత్తులను సాధారణ స్థాయికి తీసుకువచ్చామన్నారు. డెంగీతో ఊపిరితిత్తులు రోగిలా దెబ్బతినవని, కొన్నిసార్లు రోగ నిరోధక వ్యవస్థ, శరీర అవయవాలపై దాడి చేస్తుందని తెలిపారు. ఎక్మో చికిత్స అంటే దాదాపు ఆశలు వదిలేసుకున్నట్లే అపోహ ఉందని, దీనిపై ప్రజల్లో మరింతా అవగాహన పెంపొందించాల్సి ఉందని స్పష్టంచేశారు. తొమ్మిది రోజుల అనంతరం రోగిని డిశ్చార్జి చేయటం జరిగిందన్నారు.

అక్రమ కట్టడాల సీజ్


సీజ్ చేసిన ఓ భవనం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం హయత్‌నగర్ సర్కిల్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన పలు భవనాలను అధికారులు సీజ్ చేశారు. సాగర్ కాంప్లెక్స్, శ్రీపురంకాలనీ, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా, సచివాలయనగర్‌లో ఇటీవల అనుమతులు లేకుండా నిర్మాణాలు చేడుతుండగా టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరించి నోటీసులు జారీ చేసినా లెక్క చేయకుండా నిర్మాణాలు కొనసాగించారు. డీసీ తిప్పర్తి యాదయ్య ఆదేశాల మేరకు బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఐదు భవనాలను సీజ్ చేసేందుకు వెళ్లగా భవన యజమానులు తిరగబడటంతో పోలీసుల సహకారంతో సీజ్ చేశారు.

అధికారి లేక.. నిలిచిన ధ్రువీకరణ పత్రాల జారీ

ఎల్‌బీనగర్: హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని బర్త్ అండ్ డెత్ సెక్షన్‌లో సంబంధిత అధికారి లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బర్త్ అండ్ డెత్ పత్రాలను సర్కిల్ ఏఎంసీ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించి ధ్రువీకరించే వారు. శ్రీనివాస్ గౌడ్ 25 రోజుల క్రితం సెలవులపై వెళ్లారు. మరో అధికారిని కేటాయించక పోవడంతో సుమారు 750 ఫైళ్లు పేరుకుపోయాయి. ఆయా పత్రాల కోసం రోజూ కార్యాలయం చుట్టూ తిరిగి వెళ్లిపోతున్నారు. వారాల తరబడి ఫైళ్లు పెండింగ్‌లో ఉండడంతో దరఖాస్తుదారులు సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 10వ తరగతి పరీక్షల దరఖాస్తు కోసం బర్త్ సర్టిఫికెట్‌లో తప్పులు ఉండడంతో పాఠశాలలో నిరాకరిస్తున్నారు. తప్పులను సరి చేసుకోవడానికి దరఖాస్తులు చేసుకున్నా అధికారి లేకపోవడంతో సర్టిఫికెట్ జారీలో జాప్యం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వనస్థలిపురం: పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే శారీరక దారుఢ్యం పెంపొందుతుందని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం వనస్థలిపురంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 11వ ఢిల్లీ మెగా కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి రిమాండ్

సైదాబాద్: వేర్వేరు ఘటనల్లో నలుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన సైదాబాద్, నాగోలు పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, డీఐ ఆనంద్‌కుమార్ వివరాల ప్రకారం..సింగరేణి కాలనీలో ఉంటున్న జీహెచ్ఎంసీలో దినసరి ఉద్యోగి పి.ప్రసాద్ (21), మహేష్ (21), మరో మైనర్ బాలుడు ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇటీవల సింగరేణి కాలనీకి వెళ్లిన ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన వ్యాపారి రామ్మోహన్ యాదవ్, మొఘల్‌పురాకు చెందిన వ్యాపారి సయ్యద్ అక్బర్‌ను అటకాయించి సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

చోరీకి యత్నించిన మహిళ..

నాగోలు: చోరీకి ప్రయత్నించిన మహిళను రిమాండ్‌కు తరలించినట్లు నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్య నాయక్ వెల్లడించారు. నాగోలు డివిజన్ త్యాగరాయనగర్ కాలనీలో ఉంటున్న మధుసూదన్ ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి ఆవరణలోనే ఓ డబ్బాలో వేసి ఉద్యోగం కోసం వెళ్లాడు. సమీపంలో నివాసముండే సూర్యవంశం సంధ్య(40) డబ్బాలో ఉన్న తాళం చెవిని గమనించి మంగళవారం తలుపులు తెరిచి అల్మారాను తీసే ప్రయత్నిస్తుండగా అప్పుడే వచ్చిన మధుసూదన్ స్థానికుల సహాయంతో ఆమెను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంధ్యను రిమాండ్‌కు తరలించారు.

దారంతా మురుగు.. ఎలా వేయాలి అడుగు?

- సింగరేణి కాలనీ రహదారిపై పారుతున్న మురుగునీరు
- దారి కొట్టుకుపోయి అడుగుకో గుంత
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


మురుగులో నుంచే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీ ప్రధాన రహదారిపై నిత్యం వేల సంఖ్యల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సాగర్ జాతీయ రహదారి నుంచి సైదాబాద్, మలక్‌పేట్, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ వైపుగా వెళ్లే వాహనదారులు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. చంపాపేట, కర్మన్‌ఘాట్ నుంచి పలు కాలనీలకు చెందిన వారు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు సింగరేణి కాలనీ రహదారి మీదుగానే వెళ్తుంటారు. రోజూ వేల మంది రాకపోకలు సాగించే ఈ రహదారిపై వారం రోజులుగా మురుగు నీరు ఏరులై పారుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుంటను తలపిస్తూ..

ఈ దారిలో పారుతున్న మురుగు ప్రవాహం చూస్తే భారీ వర్షాలకు వరద పారి కుంటలా తలపిస్తోంది. వారం రోజులుగా మురుగునీరు ప్రవహిస్తుండటంతో ఈ రహదారి మొత్తం కొట్టుకుపోయింది. రహదారిపై అడుగుకు ఒక గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. గుంతలలో మురుగునీరు చేరి అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక భయాందోళనలకు గురవుతున్నారు. రోజూ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు, పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఈ రహదారిపై మీటర్ సీల్ కార్యాలయం చౌరస్తా వద్దకు చేరుకొని ఇరువైపులా ఎలా వెళ్లాలో తెలియక అవస్థలు పడుతున్నారు.


బాక్స్‌డ్రైన్ కాంట్రాక్టర్ నిర్వాకమే..

సింగరేణి కాలనీ ప్రధాన రహదారిపై మురుగు నీరు పారడానికి బాక్స్‌డ్రైన్ కాంట్రాక్టర్ నిర్వాకమే కారణమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణంలోకి డ్రైనేజీలలోని నీరు వచ్చి చేరుతుందని, దాంతో నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్న కారణంగా సదరు కాంట్రాక్టర్ డ్రైనేజీల నీరు రాకుండా కట్టడి చేసినట్లు తెలుస్తోంది. దాంతో డ్రైనేజీలలోని నీరు ఎటూ వెళ్లలేక పొంగి రహదారిపైకి పారుతోంది. కాంట్రాక్టర్ తన పనులు పూర్తి చేసుకునేందుకు ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సింగరేణి కాలనీ రహదారిపై మురుగునీరు పారుతుండటంపై వారం రోజులుగా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారంతా గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. వారికి ఆదాయ మార్గాలపై ఉన్న దృష్టి ప్రజా సమస్యలపై లేదు. సింగరేణి కాలనీలోని ప్రధాన రహదారి నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లేందుకు అనుసంధానంగా మారింది. ఈ రహదారిపై వారం రోజుల నుంచి మురుగు పారుతున్నా అధికారులు స్పందించడం లేదు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలి.

–షేక్ మహమూద్, ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

నూతన కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్-1, 2 నివాసుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి కొలిశెట్టి సంజయ్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా రేణుకుంట జగదీశ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా నరసింహరాజు, ఎస్.జాన్, కే.బాల్‌రాజ్, సత్తయ్యగౌడ్, కోశాధికారిగా రామ్మోహన్, సలహాదారులుగా లక్ష్మయ్య, అశోక్‌కుమార్‌గౌడ్, శాంతప్ప, అంజన్‌కుమార్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, సురేష్‌బాబు, క్రాంతిగౌడ్, శ్రీధర్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాయికిరణ్, ఇంద్రసేనారెడ్డి, వెంకటేష్, ఎస్.సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

నియామకం


నియామకపత్రం ఇస్తున్న నాగరాజు గౌడ్

చంచల్‌గూడ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కల్లుగీత విభాగం కార్యవర్గంలో పాతబస్తీకి చెందిన బండి సురేష్‌కు చోటు దక్కింది. కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన బండి సురేష్ కల్లుగీత విభాగం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. బుధవారం ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కేశం నాగరాజుగౌడ్ నియామకపత్రం అందజేశారు.

వ్యక్తి అదృశ్యం


సంతోష్

లింగోజిగూడ: రోజు మాదిరి పని కోసం బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ తొర్రూర్‌లో నివాసముండే దుంగ్రావత్ సంతోష్‌కు ప్రియాంకతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు అమ్మాయిలు.సంతోష్ ఇసుక లారీలలో లోడ్ అన్‌లోడ్ చేస్తుంటాడు. పనికి వెళ్లినప్పుడు మూడు నాలుగు రోజుల కోసారి ఇంటికి వస్తుంటాడు. గత నెల వెళ్లిన సంతోష్ ఈ నెల 7న ప్రియాంకకు ఫోన్ చేసి సాగర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్నానని మళ్లీ పని మీద వెళ్తున్నాని చెప్పాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం ప్రియాంక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరికి స్వల్ప గాయాలు

మలక్‌పేట: అదుపుతప్పిన కారు మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. అస్మాన్‌ఘడ్‌కు చెందిన అప్పారావు మలక్‌పేట నుంచి మూసారంబాగ్ వైపు కారు(టాటా పంచ్)లో వెళ్తున్నాడు. కారు కుడి వైపు ముందు టైర్‌లో గాలి తక్కువగా ఉండటంతో అదుపు తప్పి ముందు వెళ్తున్న యాక్టివాతో పాటు మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. యాక్టివా ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడంతో ప్రాణపాయం తప్పింది. స్వల్పంగా గాయపడిన యాక్టివా నడుపుతున్న యాదవ్‌తో పాటు అప్పారావును ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లోని పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయా కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులతో కలిసి బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవనగిరికాలనీఫేజ్-2లో సీసీ రోడ్డుకు 21.50 లక్షలు, ఎల్లారెడ్డికాలనీలో ట్రంక్లైన్ సీసీ రోడ్డుకు రూ.38లక్షలు, లక్ష్మీభవానీనగర్ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.16లక్షలు, ఆగమయ్యనగర్‌కాలనీలో సీసీ రోడ్డుకు రూ.18 లక్షలు, కొలను శివారెడ్డినగర్‌లో యూజీడీ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. నిధుల మంజూరుకు చొరవ చూపిన జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు కృతజ్ఞతలు అన్నారు. జీహెచ్ఎంసీలో నిధుల కొరత ఉండటంతో అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని, మిగిలిన సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని అన్నారు.

బహిరంగ వేలం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలో పూలు, పూజ సామగ్రి విక్రయించుకునేందుకు ఈ నెల 30న సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ ప్రేమ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఎండోమెంట్ అధికారులు నిర్దేశించి ధరావతు రూపాయలను చెల్లించిన డీడీతో పాటు పాస్‌పోర్టు ఫొటో, ఆధార్‌కార్డు, ఓటరు ఐడీతో ఈ నెల 30న హాజరు కావాలని అదే రోజు ఉదయం 11.30కు బహిరంగ వేలం ఉంటుందన్నారు.



ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

దిల్‌సుఖ్‌నగర్: చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును శ్రీ రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, ఇతర నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంర్భంగా పున్న గణేష్ నేత మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా ఉండాలని కాలనీలో గస్తీని పెంచి నిఘా వ్యవస్థను పటిష్టంగా ఉంచాలన్నారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూధన్‌రావ్, నాయకులు గట్ల రవీంద్ర, శివ, భూపాల్ రెడ్డి, దుర్గాప్రసాద్, యల్లన్న, కృష్ణా రెడ్డి ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. రూ. 39, వంకాయ రూ. 40, బెండ రూ. 60, పచ్చిమిర్చి రూ. 45, కాకర రూ. 38, బీర రూ. 55, క్యాబేజీ రూ. 25, ఫ్రెంచి బీన్స్ రూ. 115, క్యారెట్ రూ. 47, దొండ రూ. 37-40, చిక్కుడు రూ. 55-80, గోకర రూ. 50, బీట్‌రూట్ రూ. 30, క్యాప్సికం రూ. 75, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 19, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 48, చామగడ్డ రూ. 43. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి


పిండినారాయణరెడ్డి కాలనీ ప్రధాన రోడ్డుపై చెత్త

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధి హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ద్వారకాతిరుమల కాలనీలో రోడ్డు పక్కన, పిండినారాయణరెడ్డినగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై భారీగా చెత్త కుప్పలు పేరుకుపోయినా పట్టించుకునే నాథుడే లేరని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు మలక్‌పేటలో కేంద్రమంత్రి పర్యటన

మలక్‌పేట: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం(నేడు) మలక్‌పేట నియోజకవర్గంలో పర్యటిస్తారని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మలక్‌పేట కన్వీనర్ గజానంద్‌గౌడ్, మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మూసీ పరీవాహక ప్రాంతాలైన మూసారంబాగ్, శాలివాహననగర్, వినాయక వీధుల్లో పర్యటించి బాధితులతో మాట్లాడుతారన్నారు. కేంద్రమంత్రితో పాటు ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ బంగారు శ్రుతి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్ పాల్గొంటారన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల, హరీశ్‌బాబు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆలయాల్లో అష్టలక్ష్మి ఆలయం ముందు వరసలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధారెడ్డి, రంగా నర్సింహాగుప్తా, నాయికోటి పవన్‌కుమార్, ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, ఆలయ కోశాధికారి అంజయ్య గుప్తా పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు.బృందావన్ కాలనీలో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో రోడ్డుపై నీళ్లు నిల్వకుండా లెవెల్స్ చూస్తూ పనులు చేయాలన్నారు. అనంతరం బృందావన్ కాలనీ నుంచి మూసీ నది వరకు రూ.1.30 కోట్లతో నిర్మించిన బాక్స్ డ్రైనేజీ నాలాతో పాటు న్యూ మారుతినగర్ రోడ్ నెంబర్-10లో సీసీ రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. కార్పొరేటర్ వెంట రాజేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన


సభ్యత్వం అందిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ పాలన కారణంగా బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆమె బీజేపీ భాగ్యనగర్ జిల్లా నాయకులతో కలిసి ఐఎస్‌సదన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి పలువురికి సభ్యత్వం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావటం నాయకుల్లో జోష్ పెంచుతుందన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో అత్యధిక సభ్యత్వ నమోదుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రేణుకా ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ప్రధాన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డులో నయారా పెట్రోల్ పంప్ దగ్గర నిలుస్తున్న వరద నీటి నివారణ కోసం చేపట్టిన పనులను బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఎవరూ స్వప్రయోజనాల కోసం పనిచేయకుండా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్పొరేటర్ వెంట డీఈ కార్తిక్, ఏఈ మల్లికార్జున్ గౌడ్, టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాయిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.